

# 20

## సుంకోజి దేవేంద్రాచారి

గలగలమనే చప్పుడు ఆగిపోయింది. మోటారు చప్పుడూ ఆగిపోయింది. మోరడెత్తు మోసులున్న చెరకు తోట మధ్యలో చేతిలో పారపట్టుకుని ఉన్న నడివయసు స్త్రీ "ఈ నాబొట్టకరెంటు..అప్పుడే సచ్చిందా.. ఇట్ల కరెంటొాస్తే ఇంగెందరు సస్తారో" అంది.

ఆమెచుట్టూ ఎవ్వరూ లేరు..పచ్చగా ఉండే తోటమధ్యలో ఒక్కటే నిటబడుకుని ఉంది. ఐదడుగులా రెండంగుళాల ఎత్తుంటుంది. మాసిన ఎర్రచీర కట్టుకుని, నల్లటి రవిక తొడుక్కుంది.నల్లటి ముఖానికి పచ్చగా పసుపు ఉంది. నుదుటన రూపాయిబిల్లకన్నా ఇంకాస్త పెద్దగా కుంకుమబొట్టు..తలలో ఆరేడుమూరల పూలు..రెండు చేతులనిండుకు మోచేతులదాకా రంగురంగుల గాజులు..ఆమె ముఖంలో దిగులు. దిగులునుమించిన తెగింపు..కళ్లలో ఆవేదన..అంతకన్నా ఎక్కువగా కోపమూ..

ఎండిపోయన కర్రలా ఉన్న ఆమె శరీరం సన్నగా వణుకుతా ఉంది. వాతావరణం చలిగాలేదు. తొమ్మిదిగంటలకే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు..

పారను చేతిలో పట్టుకునే మోటారు పద్దకు పచ్చిందామె. చుట్టూ ఒకసారి పరిశీలనగా చూసింది. ఎక్కడా మోటారు చప్పుడు లేదు.



# గలగల

" ఈముండ కరెంటు ఎప్పుడొస్తాదో ఏమో.."అంది.

ఆమె కదిలిన ప్రతిసారి చేతుల్లోని గాజులు గలగలమంటున్నాయి.

1

ముప్పై ఏండ్లనాటిమాట..

నాయన కపిల తోలుతున్నాడు. బాన పైకొచ్చిన ప్రతిసారీ తొండంలోంచి నీళ్ళు కాలవలో గలగలమని చప్పుడు చేస్తూ దుంకుతున్నాయి..మూడు బారల లోతులో నీళ్ళున్నాయి. బాయి దరిలోపల ఒకవైపు జీవిచెట్టు.. దాని సన్నటి కొమ్మలకు జీనివాయిలు అల్లిన గూళ్ళు.. అవిగాలి వీచినప్పుడు అటూ ఇటూ కదులుతున్నాయి. ఉయ్యాలలాంటి తన గూటిలో కూర్చుని మగ గువ్వ ఒకటి శ్రద్ధగా పరిసరాలను చూస్తా ఉంది. ఇంకో చోట రెండు గువ్వలు ముచ్చట్లాడుకుంటున్నాయి.

కపిల లాగే ఎద్దులు బలంగా ఉన్నాయి. కపిల మోకుమీద కూర్చున్న నాయన ఎద్దులతో పోటీపడే మాదిరిగా ధృడంగా ఉన్నాడు.తలకు తుండుగుడ్డ చుట్టుకొనున్నాడు. పంచె తీసి పక్కన పెట్టాడు. మోకాళ్ళ దాకాపొడవున్న ఆకుపచ్చ నిక్కరు వేసుకున్నాడు. గాధా గుడ్డతో కుట్టిన బనియన్..

సూర్యుడు తూర్పునుంచి ఎగబాకుతున్నాడు. చెట్లనీడలు చాలాదూరం పడుతున్నాయి. రాత్రి కురిసిన మంచు కొంచెంకొంచెం ఆవిరై పోతా ఉంది.

ఆరడుగుల పొడవున్న నాయన కపిల తోలడం ఆపాడు.

తలకు చుట్టుకోసుండే తుండుగుడ్డ తీసి ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. మీసాలను పైకి దీడినాడు. బనియను జేబులోనించీ బీడికట్ట తీశాడు. ఒక బీడి వెలిగించాడు. నోటినిండుకు పొగ లాగాడు.. ముక్కు రంధ్రాల్లోనుంచి పొగ ఊదనబుర్రలోంచి వచ్చినట్టుగా వస్తా ఉంది.. పొలాన్ని పరిశీలనగా చూశాడు.

ఎకరా నేలలో వరిపైరు..జిలకరమసూర వడ్లు.. నిండు పొట్టతో ఉంది. రెండు కయ్యలకు అనుకుని రెండెకరాల నేలలో సజ్జ..కంకుల్లో ఇంకా గింజ ఏర్పడలా..

నాయనొకసారి పల్లె దారివైపు చూశాడు.

వెలుగులు రువ్వుతూ ఐదేళ్ల కూతురు ఆనందాన్ని మూటగట్టుకుని వస్తా ఉంది.

నాయన తిరిగి తోలడం మొదలు పెట్టాడు.

చెంగుచెంగున లేగదూడలా.., పడతానేమో అనే భయంలేకుండా.., గలగలమని చప్పుడు చేస్తా పరుగున వచ్చింది కూతురు.

చెంపలకు చేరదేసికళ్లు.. తీర్చిదిద్దినట్టున్న ముక్కు.. నల్లటి రంగు..నిపుణుడైన శిల్పి చేతిలోంచి రూపుదిద్దుకున్న అందమైన బొమ్మలా ఉంది కూతురు.

నిద్రలేవగానే బాయివద్దకు రావడం అలవాటు.. నాన్న తోలే కపిల చూడడం ఇష్టం.. బానలోంచి గభిల్లుమని దుంకే నీళ్లు, గలగలమని చప్పుడు చేస్తా కాలవలో పోవడం చాలా ఇష్టం.

పరుగున పచ్చిన కూతురు కాలవనీటిలో ఎగిరి దుంకింది.. దూకుతూనేఉంది.. దూకిన ప్రతిసారి గలగలమనే చప్పుడు.

కూతురిని కాలవనీటిలో దూకద్దని నాయన వారించలేదు.. కూతురు చేసే ప్రతిపనీ నాయనకు ఇష్టం..శుక్రవారం పుట్టింది..లక్ష్మీదేవి అని వాళ్ల నమ్మకం.. ఆనమ్మకాన్ని నిజం చేస్తూ కూతురు పుట్టినప్పటినుంచీ పంటలు బాగా పండుతున్నాయి. పంటలకు పెద్దగా చీడపీడల బెడద లేదు. నాలుగు రూకలు చేతిలో కదులుతున్నాయి.. పొలాలూ ఇల్లూ కళకళలాడుతున్నాయి.. వచ్చిపోయే మనుషులతో ఇల్లు గలగలమంటా సందడిగా ఉంది.

కాలవనీటిలో ఈ చివరనుంచి ఆ చివరకూ.. ఆ చివరనుంచీ ఈ చివరకూ పరుగులు తీస్తా ఉంది కూతురు.

కయ్యలో నీళ్లు చూసి రమ్మన్నాడు నాయన.

కూతురు కాలవలో గలగలమని చప్పుడు వచ్చేలా కాళ్ళు ఎత్తిఎత్తి వేస్తా వెళ్లింది. కయ్య గెనింపైన నడచుకుంటా ఆ చివరకు పోయింది. కిందకు వంగింది. చేతి వేళ్లను కయ్యలో నిలువుగా పెట్టింది. అరచేతి మధ్యలోకి వచ్చాయి. నీళ్లు.

వచ్చి నాయనకు చెప్పింది.

నాయన కపిలతోలడం ఆపేశాడు. ఎద్దుల అర్రులపైన కాడిమాను అలాగే ఉంచేశాడు. కాడిమానుపైన మోకును వేశాడు. తను కపిల బాన వీపుపైన వేసుకున్నాడు. ఎద్దుల పగ్గాలు చేతిలో పట్టుకుని నాయనతో గలగలా మాట్లాడతా ముందు నడుస్తా ఉంది కూతురు.

ఇద్దరూ ఇల్లు చేరుకున్నారు.

పొయ్యిమీద అన్నం.. గంజి వంచి అవుటిల్లేదానికి పెట్టింది అమ్మ.. మూకుడు సందుల్లోంచి సన్నగా ఆవిరి పైకి వస్తా ఉంది. ఇంటి పెరట్లో రోలు దగ్గర చెనిగ్గింజల ఊరిమిండి నూరతా ఉంది అమ్మ.

నాయన కపిల తోలేదానికి లేస్తానే అమ్మకూడా లేచేసింది. ఇళ్లంతా ఊడ్చేసింది. ఎద్దుల మిద్దెలో శుభ్రం చేసింది. పేడకసువంతా తీసుకుపోయి నీళ్లలో వేసింది. యింటిముందు పేడతో అలికింది. ముగ్గుపిండితో ముగ్గేసింది. నీళ్ల బాయికి పోయి ఇత్తలి బిందెతో నీళ్లు తెచ్చింది. పెరట్లో తొట్టికి పోసింది. పూలమొక్కలకు పోసింది..నీళ్లబానలో పోసింది. బియ్యంకడిగి పొయ్యిమీద పెట్టింది. పెరుగు చిలకడం మొదలు పెట్టింది. మట్టిపాత్రలో కవ్వం చేసే గలగలమనే చప్పుడు, అమ్మ చేతిగాజుల చప్పుడు.. కూతురుకు మెలకువచ్చింది.

అమ్మ చిలకడం చూస్త ఉంది కూతురు. తనుకూడా చిలకడం కోసం ప్రయత్నించి ఒకసారి కిందకు తోసేసింది పెరుగు నట్టిని. అప్పట్నించి అమ్మ తనచేతికి కవ్వం ఇవ్వటం లేదు. అమ్మతో మాట్లాడ్డం మొదలు పెట్టింది కూతురు.. ఐదేళ్ల ఆ కూతురికి ఎన్నెన్నో సందేహాలు.. గలగలా మాట్లాడుతూనే ఉంటుంది.. ఇంకా బడికి పోవడం లేదు. కూతురే కాదు..., కూతురు వయసున్న పిల్లలంతా బడికి

పోవడం లేదు. ఐదేండ్లు నిండటానికి ఇంకా నాలుగునెలలుంది. ఐదేండ్లు నిండాక బడికి పోతుంది..

అమ్మదగ్గరికి పరుగున వచ్చింది కూతురు.. ఎడమచేత్తో రుబ్బురాయి అచ్చును పట్టుకుని, కుడిచేత్తో ఊరిమిండిని తోస్తా నూరుతాండే అమ్మ దగ్గర కూర్చుంది.. గలగలని చప్పుడు చేస్తున్న అమ్మ చేతుల గాజులనే కాసేపు చూసింది.

తనను చూసినా చూడనట్టుగానే ఉంది అమ్మ. కూతురు మాటలు మొదలు పెట్టింది. అమ్మ ముఖంలో నవ్వు.. కూతురు కూడా రుబ్బురాయి అచ్చును పట్టుకుని రుబ్బడం మొదలు పెట్టింది. ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు.. ఇద్దరూ కిలకిలా నవ్వారు.

అమ్మ మెడలోని కంటి సూర్యకిరణాలు పడి తళతళా మెరుస్తా ఉంది.

వంటపని పూర్తయింది. ముగ్గురూ అన్నం తినేశారు.. కొంచెం అన్నం ఇంట్లో పెట్టి మిగిలింది కట్టుకునింది అమ్మ. అన్నం, నీళ్లపాత్ర గంపలో పెట్టుకుంది. ఎద్దులను వీధిలోకి తోలింది. వాటి పగ్గాలు కూతురు చేతిలోకి తీసుకుంది. ఎద్దులను తోలుకుని అమ్మాకూతురు చేనువైపు నడక మొదలు పెట్టారు. ఇరవైనిముషాల్లో చేనుపద్దకు చేరుకున్నారు.

చేను పక్కనే చిన్న గుట్ట ఉంది. కూతురు గుట్ట ఎక్కి రాళ్లమీద అటూ ఇటూ దూకుతా ఉంది. పడతావని అమ్మ చెప్పినా వినిపించుకోవడం లేదు.

ఆకాశం మబ్బేసుకుంది. కాసేపట్లోనే వాన మొదలయింది. చేను పక్కనే ఉండే పెద్ద వేపచెట్టు మొదలు వద్దకు చేరుకున్నారు అమ్మా కూతురు.. గలగలమనే వాన చప్పుడు.. తడవకుండా అమ్మ కొంగు చాటున నిల్చున్న కూతురు ఒక్కుదుటున వానలోకి పరుగులు తీసింది. చేతులు రెండు చాపుకుని ఆకాశంవేపు చూస్తా గిర్రన తిరగడం మొదలు పెట్టింది.

గట్టుల్లేని కూతురు సంతోషాన్ని అమ్మ అపురూపంగా చూస్తా ఉంది.

× × ×

దుర్ర్‌మంటూ మోటరు చప్పుడు చేస్తా ఉంది. పైపులోంచి నీళ్లు గలగలమని దుంకుతున్నాయి.

"ఏమ్మే..నువొచ్చినావే.. ఇట్ల రావచ్చా.. పదకొండోదినందాకా ఇంట్లోంచి బయటికి రాగూడదు.. ఒగేళ వచ్చినా ఒంటిగా రాగూడదు.. తెలీదా?"

వంగి ఎండుతున్న చెరకు మోసులకు నీళ్లు కదుతున్న నల్లటి, ఎండిన కర్రలాంటి ఆమె నిటారుగా నిలబడింది. ఆ మాటలు అన్నామె వైపు కోపంగా చూసింది.



వ్యక్తిత్వ వికాస సమాజం, కాకినాడ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ పబ్లిక్‌స్కూల్‌నందు అద్దేపల్లి ఉదయభాస్కరరావు రచించిన 'నీదారి...' కవితా సంకలనం పరివర్తన కార్యదర్శి శ్రీ వక్కలంక రామకృష్ణ ఆవిష్కరించారు. చిత్రంలో కవి కాలనాథభట్ట వెంకటరామశాస్త్రి, డా॥ వింజరపు జనార్ధనం, డా॥ ఆర్.వి. రమణారావు, ప్రముఖ న్యాయవాది శ్రీ పి.ఎస్.ఆర్.కె. తిమ్మాజీరావు, ప్రముఖ కవి, విమర్శకులు శ్రీ మాకినీడి సూర్యభాస్కరరావు ఉన్నారు. (14-3-2009)

"ఇట్లా ఇద్దారం నేనేడా చూల్లేదమ్మా.." అంటా పోయిందామె.

తిరిగి తోటకు నీళ్లు కట్టడంలో మునిగిపోయింది.

పారను పట్టుకొనుండే చేతులు కంపిస్తున్నాయి. చేతులే కాదు.. నిలువెల్లా వణకుతోంది.. శరీరమే కాదు.., మనసు కూడా.. దుఃఖం.., బాధ.., దేనిపైనో, మంటలను చల్లార్చుకోవడానికి తనకు తనే ఊసులు చెప్పుకుంటా ఉంది.., మౌనంగా..

2

పదేండ్ల కిందటి మాట..

పెండ్లిచూపులు.. నల్లగా నేరేడు పండులా నిగనిగలాడతా ఉండే అమ్మాయిని అదే పనిగా చూస్తున్నారు అబ్బాయి తరపు వాళ్లు.. అమ్మాయి గుణగణాలగురించి చెప్పే మాటలు వింటున్నారు.

లేత ఆకుపచ్చరంగు పట్టుచీరకట్టుకుంది.. తలలో కనకాంబరాలు పెట్టుకుంది.. చాపమీద కూర్చుని ఉంది అమ్మాయి.. వోరకంటితో అబ్బాయిని అప్పుడప్పుడు చూస్తాఉంది.

అందరూ గలగలమని మాట్లాడుకుంటున్నారు..

ఒక్కడే కొడుకు.. నాన్న కాలం చేశాడు..ఆరెకరాల చేను..నాలుగెకరాలమడి. రెండు బావులు.. నాలుగు బోరు బావులు.

అమ్మాయి అబ్బాయి చూపులమధ్య పూలు పూచాయి..

నెల రోజుల్లో పెళ్లయిపోయింది..

అత్తగారింట అడుగు పెట్టిందా అమ్మాయి.. వంటా వార్పుల్లో నేర్పరి..పొలంపనుల్లో తనకు తెలీనివి లేవు..కాళ్ల గజ్జెలు ఘల్లుఘల్లుమని చప్పుడు చేస్తా ఉంటే.., గలగల మాట్లాడతా ఇల్లంతా తిరుగాడే భార్యను చూస్తే అతనికి ఎంత సంతోషమో.. పనులన్నీ వదిలి భార్యనే చూస్తా ఉందామనిపించేది.. భార్యకోసం ఏమైనా చేయాలనిపించేది..

అతను ఐదడుగులా ఎనిమిదంగుళాల ఎత్తున్నాడు. చామనచాయ.. చాలా ధృఢమైన శరీరం.. బండల్ని లాగే ఒంగోలు గిత్తలా ఉన్నాడు.. కొండల్ని సైతం పిండిచేయగలననే ధీమా అతని చేతల్లో మాటల్లో కనిపిస్తా ఉంటుంది. గలగలా దాపరికం లేకుండా మాట్లాడే భర్తంటే ఆ అమ్మాయికి చాలా ఇష్టం.. ఊపిరాడనివ్వని అతని కౌగిలిలో నలిగిపోవడమంటే అంతకన్నా ఇష్టం..

ఇంటి దగ్గర ఏ పనికీ అడ్డుచెప్పని వయసుడిగిన అత్త..

ఇద్దరిదే ఇష్టారాజ్యం..

భార్యభర్త కలసే పొలం పద్దకు పోయే వాళ్లు..

దుర్రుమనే మోటారు చప్పుడునూ, గలగలమని తొట్టిలో దుంకే నీళ్ల చప్పుడునూ వినడం ఆ అమ్మాయికి చాలా ఇష్టం.. ఆ నీళ్ల చప్పుడు వింటూ గతంలోకి జారిపోయేది.. తన అమ్మానాన్న దగ్గరకు వెళ్లిపోయేది.. నాన్న కపిల సేద్యం గుర్తుకు చేసుకునేది.. అప్పటి రోజులు ఎంతబాగున్నాయో కదా అనుకునేది.. మాయదారి కరెంటొచ్చినాంక మోటార్లొచ్చినాంక.. ముందుగా ఎద్దుల మిద్దె బోసిపోవడం కళ్లముందు మెదిలి బాధపడేది.. ఎండిపోయిన తమ బావులు.. బోర్లు వేసి అయిన అప్పులు. తన పెళ్లి చేయడానికి అమ్మానాయన పడ్డ బాధలు.. గుర్తొచ్చి కళ్లనీళ్లు పెట్టుకునేది..

భార్యను ఆ విధంగా చూశాడంటే భర్త విలవిలలాడిపోయేవాడు.. తనవలన ఏం పొరపాటు జరిగిందో అని కంగారు పడేవాడు.. తెలీక తప్పు చేసింటే మన్నించమనే వాడు. గలగలమంటూ మాట్లాడకుండా బాధగా ఉంటే చూడలేననేవాడు. కళ్లనీళ్లు పెట్టుకునేవాడు..

భర్త బాధ చూసి ఆ అమ్మాయి పుట్టింటి ఆలోచనలు ఆగిపోయేవి. కళ్ల నీళ్లు తుడుచుకుని కిలాకిలా నవ్వేది.

అలాంటివి రెండుమూడు సందర్భాలు అయ్యాక ఇంగెప్పుడన్నా నువ్వు ఏడ్చినావంటే నామీద ఒట్టే అన్నాడు ఒకసారి.. నిజంగానే ఆరోజు నుంచి ఆ అమ్మాయి పుట్టింటి వారిని తలచుకుని బాధపడ్డం మానేసింది. ఏదన్నా అవసరం అయితే భర్తే ముందుండి అత్తగారికి సాయం చేసేవాడు.

గలాగలా మాటలు...

ఒకరికోసమే మరొకరు పుట్టినట్టుగా ఉండేవాళ్లు.

పచ్చని పంటలు.. పసుపుపచ్చని ధాన్యం ఇంటినిండా.. భర్త ప్రేమ హృదయంనిండా.. పొలంలో తమకష్టం భార్య వంటిమీదకు బంగారం రూపంలో వచ్చి చేరింది.

భార్య చేతులకు నాలుగు గాజులున్నాయి. ఆ గాజులు గలగలమంటే భర్తకు చాలా ఇష్టం.

× × ×

కరెంటు పోవడంతో పారను పక్కన పెట్టి, నేల మీద కూర్చుని, మోకాళ్లమీద తల పెట్టి, రెండు చేతులను కాళ్లచుట్టూ చుట్టుకుని ఉందామె. కళ్లలోంచి నీళ్లు కుండకు చిల్లుపడ్డట్టుగా కారుతున్నాయి. "అమ్మా.." అనే పిలుపుతో ఉలికిపాటుగా తలెత్తి చూసింది.

ఎదురుగా పదేళ్లలోపు వయసున్న ఇద్దరు కూతుళ్లు. వారిని చూడగానే ఆమెలో ఏడుపు మరింతగా పెరిగింది.

కళ్లకు మసకగా కనిపిస్తున్న కూతుళ్లవేపు చేతులు సాచింది. పిల్లలిద్దరూ తల్లికి చెరొక పక్కన ఒదిగిపోయారు.. ఇద్దరినీ తన గుండెలకేసి అదుముకుందామె.. ఆమె హృదయం దుఃఖంతో ఎగిసెగిసి పడుతోంది..

ఇలా బాధపడితే బిడ్డలేం కావాల.. అని తనకు తనే ధైర్యం చెప్పుకుంది. ఏడుపును ఆపుకుంది. పైటకొంగుతో కళ్ళు తుడుచుకుని, తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో "బడిలేదా" అడిగింది పిల్లలను.

"లేదమ్మా.. ఈ పొద్దు మా సార్ రాలేదు" చెప్పారు పిల్లలు కళ్ళనీళ్లు తుడుచుకుంటా.

"వోళ్ల కయ్యకాడ మిషన్ పోతాండాది.. కరెంటొచ్చింది..పదకొండు గంటలకంతా కరెంటు పోతాది..మిషనెయ్" అంటా లేచింది ఆమె, పారను చేతికి తీసుకుంటా.



చిన్నమ్మాయి పరుగున వెళ్లి బటన్ నొక్కింది. పైపులోనించీ గలగలమంటూ నీళ్లు దుంకడం మొదలు పెట్టాయి.

"నేను కడతా నీళ్లు. పార 'ఈమ్మా" పెద్దమ్మాయి అడిగింది.

"నేనుండాను కదా..కడతాలే.." అనలేదామె.

3

నెలకిందట..

ఎండిపోయిన ఎకరం వరిపైరులో జెర్సీ ఆవులు మేస్తున్నాయి. అవి పైరును కొరుకుతా ఉంటే పరపరామని చప్పుడు వస్తా ఉంది. అవి కూడా బక్కచిక్కిపోయాయి. గెనం నీడలో కూర్చుని ఆవులనే చూస్తా ఉంది ఆమె. పండకముందే నేలరాలి వారిటిపోయిన నేరేడు పండులా ఉందామె.

పక్కనే భర్తకూడా ఉన్నాడు. కబేళాకు పోయే ఎద్దులా ఉన్నాడు.

అప్పటికే ఇరవై నాలుగు బోర్లు వేశారు. నీళ్లు పడలేదు. నేలకు తూట్లు పడ్డట్టుగానే మనసంతా గాయాలు పడ్డట్టుగా విలవిల్లాడుతున్నాడు భర్త..గలగలమనే మాటల్లేవు..

దిగులొద్దు అంటుంది భార్య.. అందరికీ అయ్యిందే మనకూ అవుతుంది అంటుంది.

బ్యాంకులో అప్పేంచేసేది అంటాడు..సొసైటీ వోళ్లు జీపేసుకుని వస్తే ఎక్కడ దాక్కునేది అంటాడు.. నాలుగు లక్షల అప్పుంది..దానికి వడ్డీ.. వోళ్లు అడగతా ఉండారు.. ఆకాశంలో మెబ్బులు చూసి వాన కురస్తాదిలే.. బతుకులు బాగుపడతాయి అని నమ్ముకుని చెనిగ్గింజలు ఏస్తిమి.. వాన మోసం చేసె..! నీళ్లను నమ్ముకుని బోర్లేస్తిమి..నీళ్లూ మోసంచేసె..! నేలను నమ్ముకుని పంట చేతికొచ్చిన పంటను అమ్మబోతే అడివే కదా.. కూలిగూడా గిట్టుబాటు కాలేదే..! ఇట్లే అయితే ఎట్ల బతికేది..? ఈమధ్య ఇలాంటి మాటలు అంటున్నాడు భర్త.

అలా నైరాశ్యంతో మాట్లాడే భర్తను చూస్తే ఆమెకు చాలా దిగులేసేది. బాధేసేది.. కళ్లలో నీళ్లు తిరిగేవి.. నువ్వు ఏడిస్తే నేను సచ్చినంత ఒట్టే అని భర్త పెళ్లయిన కొత్తల్లో అన్నమాటలు గుర్తొచ్చి దుఃఖాన్ని దిగమింగుకునేది.. భర్తకు ధైర్యం చెప్పేది..

రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలు. ఒకరు మూడు, ఒకరు ఐదు తరగతులు చదువుతున్నారు.. వోళ్లను చూసయినా మనం ధైర్యంగా బతకాల అనేది భర్తతో. అవునన్నట్టుగా తల ఊపేవాడు అతను.. ఏవో ఆలోచిస్తూ ఉండిపోయేవాడు..

గలగలమని వినసొంపుగా చప్పుడు చేసే బంగారు గాజులను అమ్మేశారు. గాజులొక్కటే కాదు..ఇంట్లోని, ఆమె ఒంటిపైనా బంగారమంతా కొంత బ్యాంకుల్లో ఉంటే కొంత అమ్మేశారు.. ఆమె మెడలోని మంగళసూత్రం మాత్రం ఉంది.. పొలంకూడా తనఖాలో ఉంది.

ఎరువుల్లో కల్తీ..

విత్తనాల్లో కల్తీ..

కొనే విత్తనాల ధర ఆకాశంలో..

పండించిన కూరగాయల ధరలు పాతాళంలో..

వరి పండిస్తామంటే కరెంటివ్వలేము.. ఆరుతడి పంటలేసుకోండి అని పాలకులు హుకుం జారిచేసిరి..

ఆరుతడి పంటలేసి కాయగూరలుపండిస్తే మార్కెట్ మోసంతో రేట్లు లేవు. టమోటాల్లాంటివి మండీల వద్ద రోడ్డుపైన పారబోయాల్సి వచ్చింది. తోటల్లోనే కాయలు వదిలేశారు. నిల్వ ఉంచి అమ్ముకోను అవేమీ వడ్లు కాదు కదా?

అడుగు ఎలా ముందుకు వేయాలో తెలీడం లేదు అతనికి. తనను నీళ్లలో ముంచేస్తున్నట్టు

విలవిల్లాడిపోతున్నాడు. ఒక గదిలో బంధించి గాలి మెలమెల్లగా తీసేస్తున్నట్టు అంతకంతకూ జీవించే ధైర్యాన్ని కోల్పోతున్నాడు.

× × ×

"కరెంటు ఇంగ రేత్రికి తొమ్మిది గంటలకు వస్తాది" అంది ఆమె.

డుర్రమనే మోటారు చప్పుడు ఆగిపోయింది. గలగలమనే నీళ్లచప్పుడూ ఆగిపోయింది.

చెరకు తోట పచ్చగా ఉంది. వాటికి తగినంత ఎరువులు వేయకపోవడంతో పీలగా ఉన్నాయి మొక్కలు. తోటకు అనుకునే గెనం వారింటీ కానగచెట్లు.. వాటిని చూడగానే ఆమెకు కళ్ళలో నీళ్లు తిరిగాయి. పిల్లలను చూడగానే నీళ్లు కనురెప్పలు దాటి బయటకు రాలేదు.

పిల్లలను తీసుకుని పల్లెవైపు నడక మొదలు పెట్టింది.

ఆమె చేతులు కదిలిన ప్రతిసారీ గాజులు గలగలమంటున్నాయి. మామూలుగా గాజుల గలగలలంటే ఆమెకు చాలా ఇష్టం.. అయితే ఇప్పుడా గాజుల గలగలను వినలేకుండా ఉంది. ఇబ్బందిగానూ, బాధగానూ ఉంది.

పిల్లలిద్దరూ ఆమె వెనకే మౌనంగా వస్తున్నారు.

దారిలో తమ పల్లెవాళ్లు ఇద్దరు ఎదురు పడ్డారు.. తమను దాటి పోతూ "చూడమ్మా.. ఈ ఆడది ఎంతకు బరితెగించిందో.. ఎవురన్నా నీళ్లొదలకముందే తోటకు నీళ్లు కట్టేదానికి పోతారా" అంటున్నారు.

వాళ్లమాటలు విన్నా విననట్టుగానే ఉంది ఆమె. అయితే పిల్లలు అలా మౌనంగా ఉండలేకపోయారు.."నీళ్లొదిలేదంటే ఏందమ్మా" అడిగారు అమ్మను.

"కట్ట తెంపేసి చెర్లో నీళ్లన్నీ వదిలేసేది"

"మునిగిపోతాయి.. వాటిల్లో శక్తి ఉండే మొక్కలు మల్లా మెల్లగా పైకి లేస్తాయి.. బతుక్కుంటాయి.."

4

మూడు రోజుల కిందట..

పొద్దునే ఆరుగంటలు.. మసకమసకగా ఉంది. మంచు ఉంది. భర్తకోసం ఎదురు చూస్తా ఉందామె. కరెంటు రాత్రి పన్నెండుగంటలనుంచీ నాలుగుగంటల వరకూ ఉంటదంతే. కరెంటు పోతానే ఇంటికొచ్చి పడుకునే భర్త రెండు గంటలయినా రాకపోయేప్పటికి ఆమెకు కంగారుగా ఉంది. ఆమె మనసు ఎందుకో కీడు శంకిస్తా ఉంది. జెర్సీ ఆవుల దగ్గర పాలు పిండి క్యారేజిలో పోసింది. డిపోలో పోసేసి రమ్మని పిల్లలకు చెప్పి పొలం వద్దకు బయలు దేరింది. ఎందుకో ఆమెకు అడుగులు తడబడుతున్నాయి

పొలం వద్ద..గట్టు పైన ఉండే కానుగచెట్టుకు.. భర్త శవమై వేలాడుతున్నాడు.. అతడిని చూడగానే ఆమె నవనాడులూ కృంగిపోయాయి.. తను కూడా శవంవద్ద పెద్దకేక వేసి కూలిపోయింది. చుట్టుపక్కల వాళ్లు వచ్చారు. పోలీసోళ్లు వచ్చారు...రెవెన్యూ వాళ్లు వచ్చారు..ఎవరెవరో అధికారులు వచ్చారు.. ఏవేవో మాటలు చెప్పారు.. ధైర్యం చెప్పామని వారు అనుకుంటున్నారు. అవేవీ ఆమె మనసులోకి కాదుకదా.., కనీసం చెవుల్లోకి కూడా పోవడంలేదు.

భర్త గలగలమనే మాటలే వినిపిస్తున్నాయి.. భర్త నవ్వుముఖమే కళ్లకెదురుగా కనిపిస్తా ఉంది. నువ్వు ఏడిస్తే నేను సచ్చినంత ఒట్టే అన్న భర్తమాటలు గుర్తొస్తున్నాయి. ఏడ్వకుండా ఉండటానికి ఎంతగానో ప్రయత్నిస్తా ఉంది. ఆమెను చుట్టుకుపోయారు పిల్లలిద్దరూ..

ఏడాది క్రితం అత్త చనిపోయింది. ఇప్పుడు భర్త బలవన్మరణం..

ఎన్నెన్ని ఊసులు..ఎన్నెన్ని బాసలు..

మనరూపం పంచుకుని, మన రక్తం పంచుకుని బిడ్డలు..వాళ్ల భవిష్యత్తు.. ఇవేవీ నీకు గుర్తు రాలేదా..? ఇలా సుఖంగా వెళ్లిపోవడానికి నీకు మనసెలా వచ్చింది.. మేమంతా ఎట్ల బతకాల? నేనేదన్నా చిన్న పని చేస్తానన్నా.. నేనుండాను కదా, నువ్వెందుకులే అనేవాడివే.. ఇప్పుడు మా పన్లన్నీ ఎవురు చేసిపెడతారు.. సేద్యం ఎవరు చేస్తారు.. సేద్యం చేయకుంటే బతికేదెట్లా.. ఇన్ని అప్పులు పెట్టుకుని సేద్యం చేసేది ఎట్లా..? నమ్ముకున్నోడే మోసం చేసి తనదోవతాను చూసుకున్నేంక పొలం నమ్ముకొని బతగ్గలమా? చేతుల్లో శక్తి ఉండి, గుండెల్లో ధైర్యముండీ బతకలేకపోయాడే.. తనెట్ల నెట్టుకొస్తాది దీన్ని..? రకరకాల ఆలోచనలు ఆమె మనసులో మెదులుతున్నాయి.

బంధువులందరూ వచ్చారు. చేయాల్సిన తంతు చేసేశారు. పదకొండోరోజు కర్మక్రియలు చేయాలని నిర్ణయించారు.

అప్పులవాళ్లు వచ్చారు.

తనఖా పొలం తమకే ఇచ్చేయమని కొందరు., మిగిలిన పొలం అమ్మేసి తమ బాకీలు తీర్చమని మరికొందరు.., పొలం వద్దు, ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం తమకే ఇవ్వమనే ఉదారవాదులు కొందరు..

ఎవ్వరికీ సమాధానం చెప్పలేదామె..

అసలామె మనసులో ఏముందో కూడా ఎవ్వరికీ తెలీదు..

బంధువులే కలగజేసుకున్నారు.. అప్పులోల్లకు సర్దిచెప్పి పంపించారు.. కర్మక్రియలు అయిపోయేదాకా ఇల్లు కదలద్దన్నారు.

అంత బాధలో కూడా చెరకు మోసులు మనసులో మెదిలాయి. రాత్రి పూట, వేళకాని వేళలో వచ్చే కరెంటు గుర్తొచ్చింది. తడి తగలకపోతే మోసాలు ఎండి పోతాయి.. పెట్టిన పైరును చంపుకునే వాడు రైతే కాదు అనేవాడు భర్త. రక్తం ధారపోసయినా పైరును బతికించుకోవాలనేవాడు.. తను పెంచిన పైరు ఎండిపోవడం భరించలేకపోయాడు.. అందుకే ఇరవై ఐదో బోరు వేశాడు.. తమకు పుట్టిన మోసులూ.

× × ×

"ఏమా బూలచ్చిమీ... దినాలయిందాంకా ఇంటికాన్నే ఉన్నింటేనేమి?" దోవలో ఎదురొచ్చిన నాయన అడిగాడు.

తాతను చూడగానే పిల్లలిద్దరూ ఆయన వద్దకు పోయి చెరొక చేతిని పట్టుకున్నారు. అందరూ కలసి పల్లెవైపు నడుస్తున్నారు. ఆమె మౌనంగా ఉంది.

నాయన బాగా ముసలి వాడైపోయాడు. గూని వచ్చేసింది. గానుగలోంచి వచ్చిన చెరుకు పిప్పిలా ఉన్నాడతను. "ఇబ్బుడే ఇంటికొచ్చినా.. బీగం ఏసిన్నేరు.. పక్కింట్లో వోళ్లు చెప్పిరి.. చెరకుతోటకు నీళ్లు కట్టేదానికి పోయిండాది అని.. ఎమ్మటే ఇట్ల ఎలబారొస్తి" వివరించాదతను.

కాళ్లగజ్జెలతో గలగలమని చప్పుడు చేస్తా లేగదూడలా దుంకే కూతురు..

గలగలా మాట్లాడుతూ కలివిడిగా ఉండే కూతురు..మౌనంగా ఉంది.

"ఇంగ వారం దినాలే కదామ్మా.. ఇంటికాన్నే ఉండు" అన్నాడు తండ్రి.

"ఎట్లుండమంటావు నాయనా ఇంటికాద.. ఎవురుండారు చేసేదానికి.. ఆయనేమో సుకంగా పాయ.. ఇద్దరు నేదరు బిడ్డలుండారు.. వోళ్లను అయనమాదిరిగా గాలికి వదిలేసి నేనూ ఉరేసుకుని చావలేను గదా.. మీకేం..మొగోళ్లకు ఎన్నయినా చెప్తారు.. ఏచిన్న ఇబ్బంది వచ్చినా వదిలేసి ఎళ్లిపోతారు.. మాకట్ల కాదుకదా.. తొమ్మిదినెలలు మోసి, సమచ్చరం రోజులు పాలిచ్చి పెంచినా.. నా రక్తం నాయనా బిడ్డలు.. నేను సాస్త్రాలు సాంగేలు అని ఇంటికాన్నే ఉంటే చెరకు తోట ఎండిపోతాది.. మళ్ల నీళ్లు కట్టీ ప్రయోజనం ఏముందాది? పైరుపచ్చగా ఉంటేనే కదా బతుకులు.. మేం బతకాలంటే పైరుతో పోరకాలాడాల.. ఇంట్లో ఉంటే ఎవురు చూస్తారు..ఎవురన్నా చూసేటిగా ఉంటే.., ఆయనెందుకు సచ్చిపోయుంటాడు.. ఆయన మాదిరిగా నేను సావాలంటే.., నేను ఒకదాన్ని కాదే.. ముగ్గుర్ని.. ముగ్గురి పాణాలు ఎట్లాతీసుకునేది..?"

భూలక్ష్మి గలగలా మాట్లాడతా ఉంది...

దుఃఖం ఆమె గొంతుకు అడ్డం పడుతున్నా...

బాధ ఆమె గుండెను పిండుతున్నా

వేదనలోంచే మాటలు గలగలా వస్తున్నాయి.